# ఆవు - పులి

మూడో కథ

ఒమ్మి రమేష్‌బాబు

## వాత: భక్తిగల ఆవు మందకే చేటు

అనగనగనగా ఒక వూరు.

ఆ వూరిలో ఒక ఆవు. ఆ ఆవుని అందరూ గోమాత అని పిల్చేవారు. గోమాత ఎన్నడూ ఆడి తప్పలేదు. దైవాజ్ఞని జవదాటడం ఎవరి తరమూ కాదని నమ్మేది. కష్టం వస్తే దేవుడి మీదే భారం మోపి దణ్ణం పెట్టేది. అందువల్ల, అంత భక్తిగల మంచి ఆవు ఆ చుట్టుపక్కల ఎక్కడా లేదని వూరంతా చెప్పుకునే వారు.

గోమాతకి ఒక లేగదూడ వుంది. ఆ లేగదూడ వారాల బిడ్డ. అది ఎప్పుడూ తల్లి చుట్టూనే చెంగుచెంగున గంతులేసేది. దాని ఒంటినిండా పాల వాసన గుప్పుమనేది.

లేగదూడ తల్లి పొదుగుని కుమ్ముతూ పాలు తాగుతుంటే, గోమాత దాని లేత ఒంటిని ప్రేమగా నాకు తుండేది. తల్లిబిడ్డల ముద్దూ మురిపాలు లోకమంతటికీ ముచ్చటగొలిపేది.

ఆ వూరిలోని ఆవులన్నీ ప్రతిరోజు మధ్యాహ్నం మంద కట్టేవి. ఆ మందని పశువుల కాపరి పచ్చిక బయలుకి తోలుకపోయేవాడు. పాలు కుడిచే లేగదూడలు మాత్రం ఇళ్ళ దగ్గరే వుండి పోయేవి.

ఎప్పటిలాగే ఒకనాడు పశువుల కాపరి ఆవుల మందని మేత కోసం తోలుకపోయాడు. అది వూరికి శివారు ప్రాంతం. అక్కడంతా పచ్చిక ఏపుగా పెరిగింది. పచ్చిక బయలుకి ఒకవేపున విశాలమైన చెరువు. మరొక వొంక దట్టమైన అడవి. ఆ అడవి క్రూరమృగాలకి ఆలవాలం.

మందలోని ఆవులు ఎన్నడూ పచ్చిక బయలుని దాటిపోలేదు. అడవిలోకి అడుగుపెట్టలేదు. కడుపు నిండేంత మేత కాళ్ళ దగ్గరే వున్నందున అవి ఎటూ చెదిరిపోలేదు.

ఆ రోజున కూడా ఆవులన్నీ చెలాకీగా మేత మేస్తున్నాయి. దుబ్బు దుబ్బుగా పెరిగిన పచ్చగడ్డిని దవళ్ళ కొద్దీ గుంజుతున్నాయి. పసిరిక పురుగులు, మిడతలు ఎగిరిపడుతుంటే దొప్పల్లాంటి చెవులతో విసిరికొడుతున్నాయి.

అలా మందలోని ఆవులన్నీ మేతలో లీనమైతే గోమాత ఒక్కటీ ఆలోచనలో పడింది. దానికి పదేపదే ఇంటి దగ్గరి లేగదూడ గుర్తుకొచ్చింది. తన చిన్నారి బిడ్డకి ఆకలవుతుందేమో అని దిగులుపడింది. దూడ ఎదుగుతున్న కొద్దీ పాలు చాలడం లేదు. అందువల్ల కడుపు నిండా మేసి పొదుగు నిండా పాలని నింపుకోవాలనుకుంది. అనుకున్నదే తడవుగా అది దట్టమైన పచ్చిక ఎక్కువగా ఏ దిక్కునుందో వెదికింది. ఆ దిక్కుకే మేతకి పోయింది.

ఇంటి దగ్గరి బిడ్డ సంగతి తప్ప గోమాతకి మంద గురించిన గుర్తే లేదు. పరధ్యానంతో తాను అడవి దారి పట్టానన్న సంగతీ గుర్తించ లేదు. అందిన పచ్చికని అందినట్టు మేస్తూ ముందుకి ముందుకి పోయింది.

మధ్యాహ్నం దించిన మోర పొద్దుగుంకిన తర్వాత కాని ఎత్తలేదు. అప్పటికే గోమాత అడివిలోకి ప్రవేశించడం వల్ల ఒక్కసారిగా చుట్టూ చీకట్లు కమ్ముకున్నాయి. ఇంటికి చేరాల్సిన వేళ మించిపోయి చాలాసేపయ్యింది. చుట్టుపక్కల ఎక్కడ వెదికినా దట్టమైన అడవి తప్ప ఆవులమంద కనిపించ లేదు.

కారడవిలో తాను ఒక్కర్తీ చిక్కుకున్నానని గ్రహించగానే గోమాతకి ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది. మందకి వినిపిస్తుందేమోనన్న ఆశతో అది గట్టిగట్టిగా రంకెలేసింది. ఎటునుంచీ బదులు రాలేదు. ఇక చేసేదేంలేక, వచ్చిన



దారిని గుర్తుచేసుకుంటూ వెనుకంజ వేసింది.

చీకటి అప్పుడప్పుడే చిక్కనవుతోంది. నడుస్తున్న తోవలో రకరకాల పొదలు, లతలు కాళ్ళకి బంధాలేస్తున్నాయి. వాటిని తప్పించుకుంటూ గోమాత వడివడిగా అడుగులేస్తోంది. అడుగులు తడబడుతున్నాయి. గిట్టల చప్పుడుకి నేల అదిరిపడుతోంది.

ఇంతలో అక్కడి పరిసరాలు, గాలి విచిత్రమైన వాసనతో నిండిపోయాయి. ఆ వాసనని పసిగట్టిన గోమాత ముక్కుపుటాలు ప్రమాద సంకేతంగా విచ్చుకున్నాయి. వెంటనే దాని నడక పూర్తిగా మందగించిపోయింది. సరిగ్గా మూడంటే మూడే క్షణాలలో...

గోమాత ముందున్న పొదల్లోంచి ఒక పెద్దపులి లంఘించి దూకింది. తోవకి అడ్డంగా నిలబడి అడవి దద్దరిల్లేలా భీకరంగా గాండ్రించింది.

ఆకలితో నకనకలాడుతున్న ఆ పెద్దపులి మహా రౌద్రంగా వుంది. అంత చీకట్లోనూ అది పసుపుపచ్చగా మెరిసిపోతోంది. దాని ఒంటిమీది నల్లని చారలు నిగనిగలాడుతూ కనిపిస్తున్నాయి. కళ్ళు నిప్పుకణికల్లా భగభగమంటున్నాయి. విచ్చుకున్న పంజాల చివర గోళ్ళు విచ్చుకత్తుల్లా గురిచూస్తున్నాయి.

పెద్దపులి నుంచి తప్పించుకునే దిక్కులేక ఆవు బెదురు బెదురుగా నిల్చుండిపోయింది.

పొడవాటి ఎర్రని నాలుకని పెదాల మీదకి జార్చి మీసాలు దువ్వుకుంటూ పులి ఇలా అన్నది:

"ఇక ఎక్కడికీ తప్పించుకోలేవు. ఈవాల్టి నా వేటకి దక్కే ఆహారానివి నువ్వే"

పెద్దపులి మాటలకి ఆవు ప్రాణాలు పైపైకే పోయాయి. అపాయం నుంచి గట్టెక్కే మార్గం లేనందున తనకిక చావు తప్పదని నిశ్చయానికొచ్చింది.

అలా నిశ్చయించుకున్నప్పటికీ, గోమాత మనసు మాత్రం బిడ్డ మీది మమకారంతో అల్లాడిపోయింది. ఇంటి దగ్గర తన బిడ్డ ఆకలితో అలమటి స్తుందేమో అన్న ఆలోచనతో కడుపు దేవుకపోయింది. తను లేకపోతే ఇక తన బిడ్డ అనాథగా మిగిలిపోతుందే అన్న బాధతో కళ్ళలోకి నీళ్ళు తిరిగాయి.

గోమాత లోలోపల ఇలా కల్లోలపడటాన్ని గమనించిన పెద్దపులి మరోసారి పెద్దగా గాండ్రిస్తూ ఇలా అన్నది:

"ప్రాణభయంతో కన్నీళ్ళు పెట్టకు. నావంటి పులిరాజుకి ఆహారం కావడమంటే నీ జన్మ ధన్యమైనట్టే"

ఆ మాటలకి గోమాత కొంత తెప్పరిల్లింది. పులిరాజుకి మొక్కుతున్నట్టుగా మోరసాచి ఇలా జవాబిచ్చింది:



"నేను మహా భక్తురాలిని. నాకు ప్రాణభయం లేదు. ఇంటి దగ్గర ఆకలితో అల్లాడుతున్న నా బిడ్డని తల్చుకుంటే కన్నీళ్ళొచ్చాయి"

"నువ్వు బిడ్డతల్లివా? అయితే నీ పాలపొదుగే నాకు మొదటి ఆహారం"

ఆ మాటతో ఆవుకి మరింత కన్నీళ్ళొచ్చాయి. కడుపు తీపితో కళ్ళు ధారలు కడుతుంటే అది పులిరాజు ముందు మోకరిల్లి ఇలా వేడుకుంది:

"ఆజన్మాంతం నేను ఆడితప్పని దాన్ని. సత్యనిష్ఠాపరురాలిని. నీ వంటి పులిరాజుకి ఆహారం కావడం కన్నా మహద్భాగ్యం లేనేలేదు నాకు. అయితే, నాకొక వరం ప్రసాదించు, అంతేచాలు"

ఆవేదనతో కూడిన గోమాత వేడుకోలుకి పెద్దపులి ప్రసన్నురాలయ్యింది.

"చావబోయే ముందు చివరి కోరికా!" అని మొదట క్రూరవిలాసంగా నవ్వింది. తన పక్కనే వున్న చెట్టుమొదలుకి పంజా దువ్వుతూ గోళ్ళు పదును పెట్టుకుంది.

ఆ తర్వాత-

"కోరుకో నీకేం కావాలో" అని కోరమీసాలు సవరించుకుంటూ అభయమిచ్చింది.

పులి అభయమివ్వగానే ఆవు మరింత వినమ్రతతో తల వంచింది.

"మధ్యాహ్నం వేళనగా నా బిడ్డకి పాలిచ్చి వచ్చాను. ఇప్పటికే చాలా ఆలస్యమయ్యింది. నా కోసం ఎదురుచూసి ఎదురుచూసి ఆకలితో సొమ్మసిల్లి వుంటుంది. వేగిరం ఇంటికిపోయి, నా లేగకి కడుపారా పాలు కుడుపుతాను. బిడ్డ దగ్గర కడసారి వీడ్కోలు తీసుకుని వస్తాను"

ఆవు మాటలు పూర్తి కాగానే పులి హేళనగా నవ్వింది. నవ్వి-

"పైకి సత్యవంతురాలిగానే కన్పిస్తున్నావు గానీ, నీ మాటల మీద నాకు విశ్వాసం లేదు. అభయమిచ్చాను కదా అని తప్పించుకోజూస్తున్నావు. దానికి నీ బిడ్డని సాకుగా చెప్తున్నావు" అన్నది.

పులిరాజుకి తన మాటలపై నమ్మకం కలగకపోవడంతో గోమాత ఖిన్నురాలయ్యింది. కళ్ళలోని కాస్త వెలుగూ ఆర్పుకపోగా మరింత దీనంగా వేడుకుంది:

"లేదు పులిరాజా, లేదు. ఆడితప్పే

కన్నా చావు నయమని నమ్మేదాన్ని. నా మాటల్ని శంకించవద్దు. అవకాశమిస్తే సత్య పరీక్షకి నేనెప్పుడూ సిద్ధంగానే వుంటాను"

ఆ జవాబునే పులిరాజు కోరుకున్నది. అందువల్ల తెగ మెచ్చుకుంది.

"భేష్! సత్యపరీక్షకి నిలుస్తానని సవాలు చేయగల గోవు నాకింతవరకూ ఎదురుపడ లేదు. నిజంగానే నువ్విప్పుడు ఆ సవాలుని స్వీకరించు. నీ బిడ్డని తెచ్చి నాకు చూపించు. అప్పుడు మాత్రమే నీ బిడ్డకి పాలిచ్చే వరాన్నిస్తాను" అని హామీ ఇచ్చింది.

దైవంపై భారంవేసి బతికే ఆ గోమాతకి అంతకన్నా కావలిసిందేముందీ?

పులి రూపంలో పరమాత్ముడే సాక్షాత్కరించి తన జన్మ ధన్యం చేశాడని భావించింది. మృత్యువు బెదిరించినా మాట తప్పని ఆవుగా చిరకాలం నిల్చిపోవాలని తలపోసింది. ఆ మేరకు పులి ముందు ప్రమాణంచేసి వడివడిగా ఇల్లు చేరింది.

అది రాత్రా పగలా అనే స్పృహనే మరిచింది. జరగబోయేదంతా ముందే తెలుసుకున్న జ్ఞానిమల్లే నిశ్చింతలుపోయింది. లేగదూడని వెంటతీసుకుని మళ్ళీ అడవిదారి పట్టింది.

తల్లిఆవు కాసిన్ని పాలన్నా ఇవ్వకుండా అలా వెళ్ళిపోతుంటే ఆ పసిదూడ బుడిబుడి నడకలతో అనుసరించింది.

నడుస్తూ నడుస్తూ తన బిడ్డకి గోమాత లోకనీతిని బోధించింది.

మందని దాటిపోతే మహా ప్రమాదం కనుక ఏనాడూ మందని వీడిపోవద్దని చెప్పింది. పరాయి చేలల్లోకి మేతకిపోతే దెబ్బలు తప్పవని హెచ్చరించింది.

భక్తిముందా బతుకు ముందా అని ఏనాడూ తర్కించవద్దంది. దేవుడికీ, సత్యానికి కట్టుబడి బతకడమే జన్మకి సార్థకమని చెప్పింది. ఇన్నాళ్ళూ తాను అనుసరించిన ఈ మార్గాన్నే అనుసరిస్తానని బిడ్డ చేత ప్రమాణం చేయించుకుంది.

ప్రమాణం ఇచ్చిపుచ్చుకోవడం పూర్తయ్యేసరికి తల్లిఆవు, లేగదూడ అడవిలోకి ప్రవేశించాయి. మరికొద్దిసేపటికే గోమాత తన బిడ్డని పులిరాజు ముందు నిలిపి, 'సత్యనిష్ఠలో నాదే గెలుపు' అన్నట్టు గర్వంగా చూసింది.

మాట నిలబెట్టుకున్న ఆవుని చూసి పులి ఆశ్చర్యపోయింది.

మొదట, తల్లిఆవుని చూడగానే పులి నాలుక రక్తదాహంతో కొట్టుకలాడింది. ఇప్పుడు లేగదూడని చూస్తుంటే లేతమాంసం రుచికోసం తహతహలాడుతోంది. ఈ లెక్కన ఆవుల మందనే వూహించి అది దీర్ఘాలోచనలో పడింది.

పులి ఏం ఆలోచిస్తుందో ఆవుకి అంతుబట్టలేదు.

తన సత్యనిష్ఠని చూసి ఆ విధంగా నిశ్చేష్టురాలైందని భావించి ఇలా అన్నది:

"పులిరాజా! ఇక నాకు అనుమతిస్తే నేను నా బిడ్డకి కడుపారా పాలిస్తాను. ఆ పిదప మీకు నన్ను ఆహారంగా సమర్పించుకుంటాను"

ఆ మాటతో పులి ఆలోచన నుంచి తేరుకుంది. తేరుకుని-

"లేదు లేదు! అంతమాటనకు. నీ సత్యనిష్ఠని చూస్తే నాకు కనువిప్పు కలిగింది. నీ దర్శనభాగ్యంతో ఈ క్షణాన్నే పాపవిముక్తి పొందాను. ఇక బతికినంత కాలం సాత్వికంగా బతుకుతాను. నీ బిడ్డతో సహా నువ్విక స్వేచ్ఛగా వెళ్ళిపో. నిర్భయంగా నీ మందని చేరుకో" అని భక్తితో నమ్మబలికింది.

పులి మాటలకి ఆవు పులకించిపోయింది. భక్తిమార్గంతో ఒక క్రూరమృగాన్ని శాపవిముక్తురాలిని చేసిన ఘనత తనదేనని మురిసిపోయింది.

చల్లగా బతకమని పులిరాజుని పదేపదే దీవించింది.

తర్వాత, తన బిడ్డని మోరకిందకి హత్తుకుని వూరిలోకి బయలుదేరింది.

గర్వాతిశయంతో అరమోడ్పు కళ్ళతో వూరి దిక్కుగా పోతున్న ఆ గోమాత, ఆకలితో పాలపొదుగుని తడుముతూ నడుస్తున్న లేగదూడ, తమని పెద్దపులి అనుసరించి వస్తున్న సంగతిని గుర్తించలేదు.

ఆ విషయం వాటికి తెలిసే లోగానే జరగాల్సిన ప్రమాదం జరిగిపోయింది.

ఆవులమంద ఆచూకీ కనుక్కున్న ఆ పెద్దపులి ఆకలేసినప్పుడల్లా ఒక్కొక్క ఆవుని ఎత్తుకపోయి విందు చేసుకుంది.


# శోభనం రాత్రి రసవంతం కావాలంటే...?

ఇది పెళ్ళిళ్ళ సీజన్. ఎందరో అమ్మాయిలు, అబ్బాయిలు పెళ్ళితో తమ జీవితాల్ని ముడేసుకుంటున్నారు. పెళ్ళయిన వెంటనే శోభనం ఏర్పాటు చేయడం మన సంప్రదాయం. అప్పటివరకు అపరిచితంగా ఉన్న వ్యక్తితో పెళ్ళి జరిగిపోవడం, ఆ రాత్రో, ఆ మరునాటి రాత్రో అతనితో/ ఆమెతో సెక్సుకు ఉపక్రమించడం జరుగుతుంది. అప్పటివరకు గడిచిన జీవితంలో ఎన్నడూ తారసపడని వ్యక్తితో సెక్సుకు ఉపక్రమించే వేళ అయోమయం, భయసందేహాలు, తెలియని ఉద్విగ్నత చోటు చేసుకుంటాయి. కనుక తొలిరాత్రిని రసవంతం చేసుకోవాలనుకునే వారు, అది చేదురాత్రిగా మారకుండా వుండేందుకు కొన్ని విషయాలు గుర్తుంచుకోవాలి.

* తొలి రాత్రి అంటేనే శరీరాల కలయిక. మగవాళ్ళు చొరవ చూపుతారనే సంగతి ఎవరి అనుభవమైనా చెబుతుంది. అయితే ఆబగా మీదపడి ఆక్రమించుకుంటే ఒకరికి సుఖం మరొకరికి దుఃఖం కలుగుతుంది. కనుక గదిలోకి భార్యరాగానే తొందరపడకండి.

* స్త్రీ నగ్నదేహం మగాడికో అద్భుతం. ఆమెను నగ్నంగా చూడాలని తపిస్తాడు. అందుకని బలవంతంగా బట్టలు విప్పే ప్రయత్నం చేయొద్దు. ముందు సావధానంగా, సంయమనంగా కూర్చుని మాట్లాడుకోండి. మగాడు కూడా స్త్రీకి అద్భుతమే. కాని చొరవ తీసుకునే స్త్రీలు అరుదు.

* అలాగే గదిలోకి వచ్చిన వెంటనే భార్యను కౌగిలిలోకి లాక్కునే ప్రయత్నం చేయొద్దు. స్త్రీని స్పర్శించడమూ అద్భుతమైన అనుభవంగా తలచడం సహజం. అందుకని మొరటుగా ప్రవర్తించకూడదు. తొలుత కాస్సేపు తియ్యటి కబుర్లతో గడపటం మంచిది.



* కబుర్ల మధ్యన శృంగారానికి సంబంధించి ఎవరి పరిజ్ఞానం ఏమిటో తెలుసుకోవాలి. ఎవరి వ్యక్తికి సెక్సు గురించి సరిగా తెలియకపోతే తెలియజెప్పాలి. అది ఎంత సహజమైన ప్రక్రియో, ఎంద ఆనందదాయకమో వివరించాలి.

* సెక్సు గురించి సినిమాల ద్వారా, మిత్రుల మాటల ద్వారా తెలుసుకున్నది చాలదు. కనుక సెక్సు పరిజ్ఞానాన్ని అందించే పుస్తకాలు ముందుగానే చదవడం మంచిది. ఇప్పుడు ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ అలాంటి పుస్తకాలు చాలానే వున్నాయి. తొలిరాత్రిన అలాంటి పుస్తకం పట్టుకుకూర్చుంటే పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది. కనుక ముందుగానే చదవటం మంచిది.

* సిగ్గుపడటం, మగాళ్ళే చొరవ తీసుకోవాలనుకోవటం సరికాదు. అమ్మాయిలు చొరవ తీసుకోవడాన్ని ఈ తరం అబ్బాయిలు ఇష్టపడతారు. కనుక సుతారంగా అతగాని చొక్కా గుండీలు విప్పటం, చెవిలో ముద్దుతో సన్నిహితం కావటం వంటి చర్యలతో మీ స్పందనల్ని తెలియజేయండి.

* తొలిరాత్రిన కరస్పర్శ కూడా మహాద్భుతం. తొలి ముద్దు సైతం ఎంతో మధురం. కనుక ఈ సన్నివేశాల్ని తీపి జ్ఞాపకాలుగా మిగుల్చుకునేలా ఇద్దరి ప్రవర్తన ఉండాలి. అందుకే త్వరపడి భార్యను మొరటుగా లాగి ముద్దుల వర్షం కురిపించకూడదు. దీనివల్ల ఆమె మనసు గాయపడుతుందని గ్రహించండి.

* మీరు త్వరగా పిల్లల్ని కనాలనుకుంటున్నారా లేదో ముందే తేల్చుకోగలిగితే మంచిది. నిజానికి ఈ విషయాన్ని శోభనం రాత్రి కన్నా ముందుగా ఇద్దరూ కూర్చుని మాట్లాడుకోవాలి. త్వరగా పిల్లలు వద్దనుకుంటే గర్భం రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో నిర్ణయించుకోడానికి వీలవుతుంది. తొలిరాత్రిన అందుకు సిద్ధమై సంగమించే అవకాశం ఉంటుంది.

* రాత్రంతా ఇలా కబుర్లతో, సెక్సు పరిజ్ఞానపు పాఠాలతో గడిపేయాలని దీనర్థం చెప్పడం ఉద్దేశం కాదు. నిజానికి ఉద్విగ్నభరితమైన ఆ క్షణాల్లో ఏ విషయాలూ గుర్తుకు రాకపోవచ్చు. కాని జాగ్రత్తగా వ్యవహరించకపోతే అంతా రసాభాస అవుతుంది. కనుకనే ఈ సూచనలు.

* పెళ్ళి జరిగినంతమాత్రానే ఒకరు మరొకరికి సొంతమైనట్టు, ఎదుటివ్యక్తి శరీరంపై అధికారం లభించినట్టు భావించకూడదు. తమ మధ్య సాన్నిహిత్యం పెరగడానికి ఇంకా చాలా సమయం పడుతుందని గ్రహించాలి.

అయితే తొలిరాత్రి శృంగారప్రక్రియ సవ్యంగా ఉంటే మీ మధ్య సాన్నిహిత్యం త్వరగా పెరిగే పెరిగే అవకాశముంది.

\- ప్రణవ